క్లుప్తంగా

నల్లజర్లలో గోగణ నివేదన



ఆలయ నిర్మాణ స్థలంలో గోగణ నివేదనలో పాల్గొన్న భక్తులు

నల్లజర్ల: స్థానిక వెంకమ్మ చింత ప్రాంతంలో శనివారం గోగణన నివేదన చేశారు. ఇక్కడ కొత్తగా నిర్మించే శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకోసం గత నెలలో ఇక్కడ దుక్కి దున్ని గడ్డి విత్తనాలు చల్లారు. సమస్థ ప్రకృతికి ఆధార భూతమైన గోవులతో ఆ భూమిలో పెరిగిన గ్రాసాన్ని గోగణ నివేదన (గోవులతో మేయించే కార్యక్రమం) నిర్వహించారు. సెప్టెంబరు 3 ఉదయం 10.39 గంటలకు ఆలయానికి భూమిపూజ చేయనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాయుడు విజయకుమార్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.6 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కార్యక్రమంలో వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, ముత్తిన ప్రసాద్, మూతిన రామారావు, పాకలపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చిడిపిలో పేదలకు బియ్యం పంపిణీ



చిడిపి గ్రామంలో పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కొవ్వూరు: మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని చిడిపి గ్రామంలో శనివారం నిస్సహాయస్థితిలో ఉన్న 25 నిరుపేద కుటుంబాలకు 15 కిలోల బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఆ సంస్థ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా నియోజకవర్గంలో 174 మంది నిరు పేదలకు మెడికల్ పింఛను కింద ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.800 వరకూ అందిస్తున్నామన్నారు. అలాగే తమ ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత వైద్య, న్యాయ సేవలు కూడా అందిస్తున్నామని తెలిపారు. ఎలాంటి ఆదరణ లేని వాళ్ల మృతి చెందితే మట్టి ఖర్చులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన బీసీ సంఘం నాయకులు తడికొప్పుల శ్రీనివాస్, కట్టా శ్రీనివాస్, మట్టా సుబ్రహ్మణ్యం, పూడి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ



విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తిమ్మరాజుపాలెం ఎంపీపీ ప్రాథమిక, మండల పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బలపం, పలకలు పంపిణీ చేశారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ పడాల రంగారావు, అయినీడి వెంకట కృష్ణ, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, కామిశెట్టి సత్యనారాయణ, బలగం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కంటిపూడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త పంచాయతీ మాజీ సర్పంచ్ కంటిపూడి సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శనివారం మోర్తలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మోర్త సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర, సర్పంచ్ చిటికెన సుజని, ఎంపీటీసీ సభ్యులు వి.రాణి, జానీ నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కన్వీనర్ చిటికెన సూర్యనారాయణ, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ చిటికెన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

గోపాలపురం: రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన వరి పంటలను శనివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల మండల అధికారులు పరిశీలించారు. మండలంలోని చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో సుమారు 350 ఎకరాలలోని వరి, 40 ఎకరాలోని చెరకు పంటలు నీట మునిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు చెప్పారు. కొవ్వాడ కాలువ వరద నీటి ఉధృతికి వరి చేలు నీట మునినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



కొవ్వూరు మండలం ఆరికిరేవులలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో మేరీమాత ఆలయం వద్దకు చేరిన వరద



వేగేశ్వరపురం వద్ద వరద ముంపులో ఉన్న కూరగాయల తోటలు



మద్దూరులో సచివాలయ సిబ్బంది, అధికారులకు సూచనలు ఇస్తున్న కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు

ప్రమాద ఘంటికలు



కొవ్వూరు గోష్పాద క్షేత్రాన్ని ముంచెత్తిన వరద

- పోటెత్తిన గోదావరి వరద
- గోష్పాద క్షేత్రాన్ని ముంచెత్తిన వైనం
- మూతపడిన ఇసుక ర్యాంపులు
- క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం

కొవ్వూరు: వరద గోదావరి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికను దాటి మహోగ్ర రూపం దాలుస్తోంది. ఎగువ నుంచి భారీగా వరద నీరొచ్చి చేరుతోంది. దాంతో శనివారం ఉదయం నుంచి గంట గంటకూ నదిలో వరద ఉధృతి పెరుగుతోంది. ఇప్పటికే కొవ్వూరులోని గోష్పాద క్షేత్రాన్ని వరద ముంచెత్తింది. ఈ క్షేత్రంలోని రోడ్లపై రెండు అడుగుల మేర వరద పారుతోంది. వరద ఇక్కడున్న ఆలయాలను చుట్టుముట్టడంతో పోలీసులు భక్తులను గాని, కర్మకాండల కోసం వచ్చే వారిని గాని క్షేత్రంలోకి అనుమతించడం లేదు. మెయిన్‌రోడ్డు వద్దే బారికేట్లు ఏర్పాటు చేసి పోలీసులను కాపలా ఉంచారు. ఇసుక ర్యాంపులన్నీ మూతపడ్డాయి. ఇక కొవ్వూరు డివిజన్‌లోని తాళ్లపూడి, నిడదవోలు, కొవ్వూరు, పెరవలి మండలాల్లోని గోదావరి తీరంలోని రేవులను, స్నానఘట్టాలను అధికారులు పూర్తిగా మూసివేశారు. తీరం వెంబడి ఉన్న గ్రామాల్లో ఎక్కడికక్కడే ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు.

1,260 ఎకరాలను ముంచెత్తిన వరద

భారీ వర్షాలు, గోదావరి వరద ఉధృతి వల్ల కొవ్వూరు డివిజన్‌లోని గోపాలపురం, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల, తాళ్లపూడి, పెరవలి మండలాల్లోని 1,260 ఎకరాల్లోని పంటలు ముంపు బారిన పడ్డాయి. ఇందులో 550 ఎకరాల్లోని వరి, 710 ఎకరాల్లోని అరటి, కూరగాయలు, కంద, బొప్పాయి, పూల తోటలను వరద ముంచెత్తింది. అత్యధికంగా పెరవలి మండలంలోని లంకల్లోని 435 ఎకరాల్లోని వివిధ రకాల ఉద్యాన పంటలు నీట మునిగాయి. మండలాలవారీగా నిడదవోలులో 52, కొవ్వూరులో 61, తాళ్లపూడిలో 30 ఎకరాల్లోని ఉద్యాన పంటలను వరద ముంచెత్తింది. క్రమంగా నదిలో వరద తీవ్రత పెరుగుతుండడంతో ఆ మేరకు పంట పొలాల్లో వరద పెరుగుతోంది. ఇప్పటికే రెండు రోజులుగా వరదలో పంటలు నానుతున్నాయి. మండలాల వారీగా కొవ్వూరులో 156 ఎకరాలు, గోపాలపురంలో 120, చాగల్లులో 20, దేవరపల్లిలో 29, నల్లజర్లలో 35, తాళ్లపూడిలో 190 ఎకరాల విస్తీర్ణంలోని వరి పంట ముంపు బారిన పడింది. పేముల కాలువ, కొవ్వాడ కాలువల వరద ఉధృతికి వర్షాలు తోడవడంతో లోతట్టు ప్రాంతాల్లోని వరి పంట నీట మునిగింది.

మద్దూరులంకలో ఆర్డీవో పర్యటన

కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు అధికార యంత్రాగంతో కలసి శనివారం మద్దూరులంక గ్రామం వెళ్లి వరద ఉధృతిని పరిశీలించారు. ఇక్కడికి సమీపంలోని నదీ గర్భంలోని పల్లెపాలెంలో నివాసం ఉంటున్న 15 మత్స్యకార కుటుంబాలకు మద్దూరు హైస్కూల్లో పునరావాసం ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఎగువన క్రమంగా వరద తీవ్రత పెరుగుతున్నందున ఏ క్షణంలో అయిన ఇక్కడి 42 మందినీ పునరావాస కేంద్రానికి తరలించేందుకు ఏర్పాటు చేశామన్నారు. పునరావాస కేంద్రంలో ఆహారం, విద్యుత్తు, తాగునీరు, పరుపులు, వైద్య సేవలు, దుప్పట్లు ఇప్పటికే అందుబాటులో ఉంచామని ఆర్డీవో వివరించారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు. మత్స్యకారులు స్వచ్ఛందంగా సురక్షిత ప్రాంతాలకు రాకపోతే పోలీసులు ద్వారా తరలిస్తామని ప్రకటించారు. అంతకు ముందు ఆర్డీవో మల్లిబాబు నదీ తీరంలో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. కొవ్వూరు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ ఆయన వెంట ఉన్నారు.

లంక భూముల్లోకి..

తాళ్లపూడి: గోదావరి వరద ఉధృతి శనివారం మరింతగా పెరిగింది. లంక భూముల్లోకి మరింత నీరు వచ్చి చేరుతోంది. ఇక్కడి పల్లపు ప్రాంతాల్లో సాగవుతున్న పలు రకాల పంటలు ముంపులో చిక్కుకున్నాయి. వేగేశ్వరపురం మేరీమాత ఆలయం వద్ద, స్వర్గధామం చుట్టూ వరద చేరింది. తాళ్లపూడి, వేగేశ్వరపురం, బల్లిపాడు పంచాయతీల పరిధిలోని గోదావరి లంకల్లో సాగవుతున్న బెండ, దొండ, అరటి, కంద, వంగ, చెరకు, ఆకుకూరల పంటలు ముంపు బారిన పడ్డాయి. వరద మరింతగా పెరిగితే దాదాపు 15 ఎకరాల్లోని పంటలకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. నదిలో చేపల వేటకు వెళ్లే పడవలు ఒడ్డుకు చేరాయి.



ప్రక్కిలంక వద్ద గోదావరి రేవును పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ

రేవులను పరిశీలించిన డీఎల్‌పీవో

గోదావరిలో వరద పెరుగుతున్నందున్న ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ సూచించారు.

మండలంలోని ప్రక్కిలంక, తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లోని గోదావరి రేవులను శనివారం డీఎల్‌పీవో అమ్మాజీ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు ఆమె పలు ఆదేశాలు జారీ చేశారు. సక్రమంగా పారిశుధ్య నిర్వహణ చేయాలని సూచించారు. ఆమె వెంట కార్యదర్శులు దుర్గాప్రసాద్, డీఎస్‌సీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌కు గోపాలపురం ఎస్సై రామకృష్ణ

- నల్లజర్ల ఎస్సైకు తాత్కాలికంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు



కె.రామకృష్ణ

కొవ్వూరు: విధి నిర్వహణలో అలసత్వం వహించిన గోపాలపురం ఎస్సై కె.రామకృష్ణను వేకెన్సీ రిజర్వు (వీఆర్)కు పంపారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ శనివారం తెలిపారు. నల్లజర్ల ఎస్సై బి.నరసింహమూర్తికి తాత్కాలికంగా గోపాలపురం ఎస్సైగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్టు డీఎస్పీ చెప్పారు. రామకృష్ణ గతేడాది ఫిబవరి 22న గోపాలపురం ఎస్సైగా విధుల్లో చేరారు. దేవరపల్లి ఎస్ఈబీ అధికారులు ఇటీవల గోపాలపరరం మండలంలోని భీమోలు గ్రామ పరిసరాల్లో జరిపిన దాడుల్లో 225 లీటర్ల సారా, ఇతర సామగ్రి పట్టుబడ్డాయి. ఈ కేసు విషయంలో ఎస్సై రామకృష్ణ అలసత్వం వహించినట్టు సమాచారం.ఈ కారణంగానే ఆయనను వీఆర్‌కు పంపినట్టు అధికారులు సైతం ధ్రువీకరించారు.

శివారు గ్రామాల విలీన ప్రతిపాదనపై హర్షం

తాళ్లపూడి: పాలనా సౌలభ్యానికి వీలుగా మండలంలోని శివారు గ్రామాలను సమీప పంచాయతీల్లో విలీనం చేయాలంటూ హోం మంత్రి తానేటి వనిత ప్రతిపాదించడంపై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పెద్దేవం శివారు గ్రామమైన రావూరుపాడును ప్రత్యేక పంచాయతీగా, విడిగా ఉన్న రెండు శివారు ప్రాంతాలను చిడిపి, బల్లిపాడు పంచాయతీల్లో విలీనం చేయడం వల్ల అక్కడి ప్రజలు ఇబ్బందులు తొలగుతాయన్నారు.అలాగే ప్రక్కిలంక శివారు పైడిమెట్టను, అన్నదేవరపేట శివారు సూరయ్యపేటలను కూడా ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పోచవరం పంచాయతీలోని తుపాలగూడెం గ్రామాన్ని కూడా ప్రత్యేక పంచాయతీగా ప్రతిపాదించారన్నారు. కొత్తగా నిర్మిస్తున్న వైఎస్సార్ నగర్‌ను కూడా కొత్త పంచాయతీగా గుర్తించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- కాల్దారిలో రెండో రోజూ గడప గడపకూ..

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కాల్దారి గ్రామంలో రెండో రోజైన శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని మహిళలను, వృద్ధులను, యువతను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే అధికారులతో కలసి ప్రజాప్రతినిధులం గడప గడపకూ వస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని గ్రామస్తులను ఆయన ఆరా తీశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించాలని అధికారులను శ్రీనివాస్‌నాయుడు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బొందల మహాలక్ష్ముడు, గుణ్ణం రవికుమార్, సాధనాల ఉమ, రేలంగి నాగేశ్వరరావు, మద్దిపాటి రామసుబ్బారావు, నిచ్చెనకోళ్ల శ్రీను, చెట్టే ఇసాక్, మేకా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నేటి చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ



చాగల్లులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

చాగల్లు: విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించే కర్షక, కార్మిక రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి సుబ్బారావు కోరారు. కిసాన్‌మోర్చ్., కేంద్ర ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చాగల్లులోని సీఐటీయూ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు, కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, కంకటాల బుద్ధుడు, ఆచంట సుభాష్ చంద్రబోస్, పి.సత్యనారాయణ, కేకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు అమానుషం



మణిపూర్ ఘటనలపై కొవ్వూరులో నిరసన తెలుపుతున్న క్రైస్తవ జేఏసీ ప్రతినిధులు



నిడదవోలులో మాట్లాడుతున్న కృష్ణ

- క్రైస్త్రవ జేఏసీ నాయకులు
- 31న కొవ్వూరు శాంతి ర్యాలీకి పిలుపు

కొవ్వూరు: క్రైస్తవులపై మణిపూర్‌లో దాడులు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడాన్ని క్రిస్టియన్ జేఏసీ తీవ్రంగా ఖండించింది. పట్టణంలోని లూథరన్ చర్చి క్రిస్టియన్ జేఏసీ శనివారం సమావేశం నిర్వహించింది. చర్చిలపై, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను తక్షణం నియంత్రించాలని సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. పాస్టర్ స్వర్ణబాబు మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో క్రైస్తవులపై సాగుతున్న హింసాకాండ కట్టడికి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. జేఏసీ సభ్యుడు కె.సాక్షిబాబు మాట్లాడుతూ చర్చిలను కూలగొట్టడం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం దుర్మార్గమని ఖండించారు. ఈ అమానుష చర్యలపై యావత్ క్రైస్తవ సమాజం స్పందించాల్సిన అవసరం ఉందని బిషప్ పిలిఫ్‌కుమార్ అన్నారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా సోమవారం కొవ్వూరులో శాంతి ర్యాలీ చేయనున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలోని క్రైస్తవులందరూ ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. బొంతా శ్యాం రవిప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాస్టర్ వి.నాని, పెనుమాక జయరాజు, ఏకే ప్రసాద్‌బాబు, ఈ జోసెఫ్, జీఎం శామ్యూల్ రాజు, రమేష్, వివిధ సంఘాల పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతోంది

నిడదవోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మణిపూర్‌లో రిజర్వేషన్ల కుంపటి రగిలించి మత విద్వేషాలను రెచ్చగొడుతోందని కుల నిర్మూలన పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ విమర్శించారు. మణిపూర్ మారణహోమంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని టౌన్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి ,చిట్టిబాబు మాట్లాడుతూ మణిపూర్ మారణహోమానికి కారకులైన ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మణిపూర్ సీఎం బీరేన్‌సింగ్‌లు రాజీనామా చేయాలన్నారు. కేవీపీఎస్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు మాట్లాడుతూ నిరుపేద హిందువుల్లోని ఎస్సీ, ఎస్టీ బీసీల దృష్టిని మళ్లించి హిందూ ఓటు బ్యాంకును పదిలపరుచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్‌కే మస్తాన్, మెరిపో జాన్‌రాజ్, కొడమంచిలి రమణ, చెట్టి రామకృష్ణ, బయ్యే మునీంద్ర, చోళ్ళ రాజు, గుణశామ్యుల్, డేవిడ్ జేమ్స్, జీవన్‌మూర్తి, హరీష్, ఆచంట ప్రసాద్, అరుగొలను పండు పాల్గొన్నారు.

చినవెంకన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: స్థానిక చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. దేవస్థానం తూర్పు వైపు ఉన్న వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌తో పాటు, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు అన్నదానం, ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. క్షేత్రంలో సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది.

కూల్ డ్రింక్, టీ షాపులో అగ్నిప్రమాదం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని గుడి సెంటర్‌లో శ్రీవారి విలాస మండపం ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్, టీ షాపులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం, మండలంలోని తిరుమలంపాలెంకు చెందిన నాయుడు రాజా కొన్నాళ్లుగా స్థానిక దుకాణంలో కూల్ డ్రింక్స్, టీ విక్రయాలు సాగిస్తున్నాడు. రోజులానే అతడు తెల్లవారుజామున షాపును తెరచి, టీ కాస్తుండగా, గ్యాస్ లీకై ఒక్కసారిగా సిలిండర్ నుంచి పెద్ద పెద్ద శబ్దాలతో మంటలు వ్యాపించాయి. దాంతో ఆ ప్రాంతంలోని స్వామివారి కల్యాణ మండపంలో నిద్రిస్తున్న భక్తులు తీవ్ర భయాందోళనతో అక్కడి నుంచి పరుగులు తీశారు. మంటలను అదుపు చేసేందుకు రాజా ఎంతగానో ప్రయత్నించాడు. అయితే సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 30 వేల నష్టం జరిగినట్టు తేల్చారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

నిడదవోలు రూరల్: నడిచి వెళుతున్న కోడి అబ్బులు అనే వృద్ధుడిని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటన ఈ నెల 25న మండలంలోని శంకరాపురం గ్రామంలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన కోడి అబ్బులు ఇంటికి నడిచి వెళుతుండగా బైక్ ఢీకొట్టింది. దీనిపై బాధితుడి భార్య అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభాని శనివారం తెలిపారు. క్షతగాత్రుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరం గ్రామంలో ఓ మహిళతో పాటు ఆమె కుమార్తెలపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ శనివారం తెలిపారు. ఎస్.ముప్పవరానికి చెందిన పెనుబోతుల వెంకటలక్ష్మికి అదే గ్రామానికి చెందిన మన్యం సత్యనారాయణకు పాత గొడవల నేపథ్యంలో వివాదం తలెత్తింది. వెంకటలక్ష్మి ఇంట్లోకి సత్యనారాయణతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి దాడి చేశారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల: స్థానిక చిన వెంకన్న ఆలయంలో శనివారం బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఆలయ భద్రతలో భాగంగా ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఆలయంలో ఈ తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా డాగ్, బాంబ్ హ్యాండ్లర్‌లు ఎస్.దుర్గారావు, ఆర్‌జే తంబి, బి.దుర్గాప్రసాద్‌లు డాగ్ రాక్సీ తో ఆలయ అనివెట్టి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, మూల మండపాలు, తదితర ప్రధాన కూడళ్లలో తనిఖీలు జరిపారు.

నేడు పురుషోత్తపల్లిలో కంటి వైద్యశిబిరం

నిడదవోలు రూరల్: లయన్స్ క్లబ్ నిడదవోలు శాఖ, స్థానిక రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఈనెల 30న మండలంలోని పురుషోత్తపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. పురుషోత్తపల్లి రామాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్ నకారాకు రిటైర్డ్ ఉద్యోగుల నివాళి

నల్లజర్ల: ఉద్యోగుల పెన్షన్ కోసం పోరాడి సాధించిన డీఎస్ నకారా వర్ధంతిని రిటైర్డ్ ప్రభుత్వోద్యోగుల సంఘ ఆధ్వర్యంలో శనివారం నల్లజర్లలో నిర్వహించారు. రిటైర్డు ప్రభుత్వోద్యోగుల సంఘాధ్యక్షుడు ఎల్ ఎం ఆలీ సాహెబ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎస్ నకారాకు వారు నివాళులర్పించారు. అనంతరం తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ వారంతా ప్రదర్శన జరిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వారంతా పోస్టు కార్డులపై తమ డిమాండ్లు రాసి పంపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.ఏసురత్నం, కోశాధికారి ప్రభుదాస్, జిల్లా ఈసీ మెంబరు ఐడీపీ అప్పారావు, కేజే విల్సన్, సీహెచ్ఎస్ మహితకుమారి పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ .. నలుగురికి తీవ్ర గాయాలు



ఘటన స్థలంలో రోడ్డుపై రోదిస్తున్న క్షతగాత్రులు

ద్వారకాతిరుమల: మండలంలోని కొమ్మర శివార్లలో శనివారం ఉదయం ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం, క్షేత్రంలో నిమ్మకాయల వ్యాపారం చేసుకునేందుకు కొమ్మర గ్రామానికి చెందిన గోకవరపు కుమారి, మానుకొండ గంగ నిమ్మకాయల బస్తాను పాసింజర్ ఆటోలో వేసుకుని, ద్వారకాతిరుమలకు వెళుతున్నారు. అదే సమయంలో రాళ్లకుంటలో ఒక రైతు వద్ద కమతం ఉంటున్న రామకృష్ణ కొమ్మర గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో, ఆటో మార్జిన్‌లోకి దూసుకెళ్లి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీగల నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయం కాగా, కుమారికి కాలు విరిగింది. అలాగే గంగకు నడుమ భాగంలో బలమైన గాయాలవగా, రామకృష్ణకు కాలు, చెయ్యి విరిగింది. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన తొలుత ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.